ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రాహుల్, అఖిలేష్‌లది ఓ ఫెయిల్యూర్ సినిమా

ప్రధానమంత్రి మోదీ

2లో..

సంపుటి: 1 | సంచిక: 362 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 7 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### మోడీ కారణంగానే దేశంలోని
# వ్యవస్థలన్నీ నాశనం




పదేళ్ళ మోడీ పాలనలో పేదలు మరింత పేదలు
కార్పోరేట్ కంపెనీలకు లక్షలకోట్లు మాఫీ
రైతులకు మాత్రం మొండిచేయి
ప్రతి మహిళ ఖాతాలో లక్ష రూపాయల నగదు జమ
నిరుద్యోగులకు తోణ ఉద్యోగావకాశాలు..ఉపాధి కల్పన
తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేసిచూపాం
దేశంలోనూ ఐదు గ్యారెంటీల అమలుకు కట్టుబడి పనిచేస్తాం
కేసీఆర్ అధికార దుర్వినియోగంపై విమర్శలు
తుక్కుగూడ జనజాతర వేదికగా రాహుల్ హామీ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశంలోని పేదలు మరింత నిరుపేదలయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీ కేవలం కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే రుణమాఫీ చేశారు గానీ, రైతులకు రుణమాఫీ చేయలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలోని తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సభ సందర్భంగా న్యాయపత్రం పేరిట మేనిఫెస్టో విడుదల చేసిన రాహుల్ గాంధీ.. తాను మేనిఫెస్టో రిలీజ్ చేయడానికే వచ్చానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇక్కడే తమ గ్యారెంటీలను విడుదల చేశామని.. ప్రజల గొంతుని వినిపించేలా తాజా మేనిఫెస్టోని సిద్ధం చేశామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణలో 30వేల ఉద్యోగాలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని.. మరికొన్ని ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేయబోతు న్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజల మనసులోని మాటలే తమ మేనిఫెస్టోలో ఉన్నాయని.. తామిస్తున్న ఐదు గ్యారెంటీలు తమ మేనిఫెస్టోకి ఆత్మలాంటివని ..మిగతా 2లో



## కేసీఆర్‌కు జైలు కూడు తినిపిస్తా

కేసీఆర్ ఇష్టం వచ్చినట్లే మాట్లాడితే చర్లపల్లిలో చిప్పకూడు ఖాయం
బీఆర్ఎస్‌ను తొక్కినట్లే.. బీజేపీని తొక్కుతాం
నమో అంటే..నమ్మించి మోసం చేయడం
ఇచ్చిన హామీలు అమలు చేయని మోడీకి ఓటెందుకు
మద్దతు ధరలు ఇవ్వనందుకా...రైతులను కాల్చి చంపినందుకా ?
ఉద్యోగాల పేరుతో మోసం చేసినందుకా..
ఎందుకు బిజెపికి ఓటేయాలో ప్రజలు ఆలోచించాలి
తుక్కుగూడ సభలో ఘాటు విమర్శలు చేసిన సీఎం రేవంత్

2

## భారత్ ఎన్నికల్లో చైనా జోక్యం



భారత్ ఎన్నికల్లో చైనా జోక్యం
మైక్రోసాఫ్ట్ సంచలన ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం):భారత్‌లో సార్వత్రిక ఎన్నికల వేళ మైక్రోసాఫ్ట్ కీలక ప్రకటన చేసింది. ఎన్నికల్లో చైనా అవాంతరాలు సృష్టించే అవకాశం ఉందని హెచ్చరించింది. భారత్ సహా అమెరికా, దక్షిణ కొరియా ఎన్నికల పక్రియలో కూడా జోక్యం చేసుకునేందుకు ప్లాన్ చేస్తోందని పేర్కొంది. ఇందుకోసం కృత్రిమ మేధను (ంఎ) అస్త్రంగా చేసుకోనుందంటూ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ (ఓతిఇసనీబనౌబి) తెలిపింది. ప్రజాస్వామ్యానికి జీవనాడులుగా భావించే ఎన్నికలకు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు సిద్ధమవుతున్నాయి. దాదాపు 64 దేశాల్లో ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వాలు ..మిగతా 2లో

## మండుటెండల్లో చల్లటి వార్త

రెండ్రోజుల్లో అక్కడక్కడా వర్షాలు
వాతావరణశాఖ వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): ఎండలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రాగల రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు కురుస్తాయని పేర్కొంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో రాత్రిళ్లు వేడిగా ఉండే అవకాశం ఉంటుందని ..మిగతా 2లో



### ములుగు జిల్లాలో
## ఎన్‌కౌంటర్
ముగ్గురు మావోల హతం

ములుగు, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): వెంకటాపురం కర్రెగుట్ట వద్ద భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. అనంతరం ఘటనా స్థలం నుంచి తుపాకులు, ఇతర పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ మావోయిస్టు ప్రబావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అందుకే అనుమానిత ప్రాంతల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. వరంగల్‌కు ..మిగతా 2లో

## రైతుల సమస్యలపై మాట్లాడితే ఎదురుదాడులా?

ఎమ్మెల్యేలను చేర్చుకుంటామని ఉత్తమ్ ప్రగల్భాలు
జహీరాబాద్ సన్నాహక సభలో హరీష్ రావు విమర్శలు

సంగారెడ్డి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తే మంత్రులకు నిద్ర పట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. జహీరాబాద్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై మంత్రులు చేసిన వ్యాఖ్యలపై ఆయన తిప్పికొట్టారు. మంత్రులు తమకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. రైతుల సమస్యల గురించి కేసీఆర్ మాట్లాడితే అమాత్యులు ఆయన్ను తిడుతున్నారని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అంటున్నారని.. ఆయనకు సిగ్గు ఉందా.? అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీ తన మేనిఫెస్టోలో ఇతర పార్టీ వాళ్లను పార్టీలోకి తీసుకోవద్దని పెడతారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు మాత్రం ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి తీసుకుంటామని అంటున్నారంటూ సెటైర్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల తర్వాత అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ అధికారంలోకి రాదని హరీష్ రావు జోస్యం చెప్పారు. 'మీరు ఎన్ని చేస్తారో చేయండి. కానీ గుర్తు పెట్టుకోండి. మేము వడ్డీతో సహా మీకు తిరిగి ఇస్తాం.' అని హెచ్చరించారు. మీరు ఎన్ని చేసినా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ మిమ్మల్ని వదిలిపెట్టమని.. వెంట పడతామని అన్నారు. లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. '200 మంది ఆత్మహత్య చేసుకుంటే కాంగ్రెస్ నేతలకు పరామర్శించడానికి సమయం లేదు. కేసీఆర్ హయాంలో పుట్ల కొద్దీ ధాన్యం పండితే.. కాంగ్రెస్ హయాంలో పుట్టెడు కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేదు. ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయలేదు. పంటకు మద్దతు ధర ఇవ్వలేదు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేదు. కేంద్రంలో ..మిగతా 2లో





### తెలంగాణలో
## వ్యవసాయం సంక్షోభం

మేడిగడ్డ నుంచి 200 క్యూసెక్కుల నీళ్లు వృథా
పిల్లర్లు కుంగాయంటూ బద్‌నామ్ చేస్తూ పోతున్నారు
ఎన్నికల హామీల అమలులో పూర్తి నిర్లక్ష్యం
రైతుదీక్షలో బిఆర్ఎస్ నేత కెటిఆర్ విమర్శలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వ్యవసాయం సంక్షోభంలో ఉందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే ఈ దుస్థితి ఊహించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్ లో రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రటి ఎండలో ప్రజల్లోకి తిరిగితే.. సీఎం రేవంత్ రెడ్డి ఐపీఎల్ మ్యాచులు అంటూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను పంపించి దున్నపోతును తెచ్చుకున్నామని ఆవేదన చెందుతున్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని ..మిగతా 2లో

# మోడీ కారణంగానే దేశంలోని వ్యవస్థలన్నీ నాశనం

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని.. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని.. అన్ని రంగాల్లోని నిరుద్యోగులకు సంవత్సరానికి రూ.1 లక్ష చొప్పున స్టైఫండ్‌తో ట్రైనింగ్ ఇప్పిస్తామని మాటిచ్చారు. ఉద్యోగాలు చేసే మహిళలు.. ఆఫీసులో, ఇంట్లో కలిపి రెండు ఉద్యోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. సంవత్సరానికి ప్రతి పేద మహిళకు రూ.1 లక్ష ఇస్తామని, ఆ డబ్బులను నేరుగా బ్యాంకుల్లో వేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో తరహాలోనే దేశంలోనూ కులగణన చేస్తామని, కులగణన చేస్తే అన్ని విషయాలు బయటపడతాయని వెల్లడించారు. దేశంలో ప్రతిరోజూ 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు.. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని మాటిచ్చారు. అలాగే.. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కార్మికులకు కనీసం వేతనం రోజుకి రూ.400 అందిస్తామని చెప్పారు. భారత్‌లోనే ప్రముఖ కంపెనీ ఓనర్లలో ఒక్కరు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లేరని.. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యం ఉండాల్సినంత లేదని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలో కూడా సర్వే చేసి.. భారత్‌లోని ధనం ఎవరి దగ్గర ఉందో బయటపెడతామని అన్నారు. ప్రజల హక్కులను ప్రజలకు తప్పకుండా అందించి తీరుతామని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. తెలంగాణతో తనకున్నది రాజకీయ సంబంధం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కుటుంబ సంబంధం అన్నారు. తెలంగాణ ప్రజలు విద్వేషాల బజార్లో ప్రేమ దుకాణాలను తెరిచారు. జీవితాంతం మీకు అందుబాటులో ఉంటానని మాట ఇస్తున్నా. రాష్ట్రం నుంచి చిన్న పిల్లోడు నన్ను పిలిచినా ఇక్కడికి వస్తాను. తెలంగాణ కొత్త రాష్ట్రం. కాంగ్రెస్ పాలనలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. మేడ్ ఇన్ చైనా కంటే.. మేడ్ ఇన్ తెలంగాణ అనే వ్యవస్థగా మారాలి’ అని రాహుల్ అన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేసినట్లుగానే.. జాతీయస్థాయిలోనూ కచ్చితంగా అమలుచేసి తీరుతామని రాహుల్ గాంధీ అన్నారు. కొన్ని నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడలోనే గ్యారంటీ కార్డు విడుదల చేశాను. రూ.500 సిలిండర్, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు,




గృహలక్ష్మి, గ్యారంటీలు ఇచ్చాం. వాటిని అమలు చేస్తున్నాం. ఈ సంగతి రాష్ట్ర ప్రజలకు తెలుసు. ఇప్పటికే 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేశాం. మరో 50 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం. ప్రజల హృదయాల నుంచి పుట్టిందే మా గ్యారంటీల పత్రం. జాతీయ మేనిఫెస్టోలో 5 గ్యారంటీలు ఉన్నాయి. విద్యావంతులైన యువకులకు సంవత్సరం శిక్షణతోపాటు నెలకు రూ.8,500 ఇస్తాం. మహిళా న్యాయం ద్వారా మహిళలకు ఏటా రూ.లక్ష ఇస్తాం. వాటిని నేరుగా బ్యాంకులోనే జమ చేస్తాం. ఇది ఓ విప్లవాత్మక పథకం. ఇకపై దేశంలో ఏ కుటుంబానికి ఏటా రూ.లక్ష ఆదాయం కంటే తక్కువ ఉండదని అన్నారు. మోదీ ప్రభుత్వం ధనవంతులకే రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేసింది. రైతుకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు. స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి పంటలకు మద్దతు ధర ఇస్తాం. జాతీయస్థాయిలో కనీస వేతనం రూ.400కి పెంచుతాం. ఉపాధి హామీ కూలీలకు వేతనం పెంచుతాం. దేశంలో 50శాతం జనాభా బీసీలుండగా... 8శాతం ఎస్టీలు, 15శాతం మంది మైనార్టీలు ఉన్నారు. మొత్తంగా 90శాతం పేదలే ఉన్నారు. దేశంలో ఏ సంస్థలో చూసినా ఈ 90శాతం మంది కనిపించరు. దేశంలోని 90 మంది ఐఏఎస్ అధికారులు ఉంటే ముగ్గురే బీసీలు. జనాభాలో ఓబీసీలు 50శాతం.. ఐఏఎస్‌ల్లో ఓబీసీల వాటా 3 శాతం మాత్రమే అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ అన్నివర్గాలకు న్యాయం చేస్తుందని, ఇదే పార్టీ అభిమతమని చెప్పారు. మోదీ వద్ద ధనం, సీబీఐ, ఈడీ ఉంటే.. కాంగ్రెస్ వద్ద ప్రేమ, స్వచ్ఛత ఉన్నాయన్నారు. గత సీఎం కెసిఆర్ ఎలా పనిచేశారో మీ అందరికీ తెలుసు. వేల ఫోన్లు ట్యాప్ చేయించారు. రెవెన్యూ, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను దుర్వినియోగం చేశారు. ట్యాపింగ్ ఆధారాలు దొరక్కుండా నదుల్లో పడేశారు. బెదిరించి, భయపెట్టి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారు. ఇక్కడ మాజీ సీఎం చేసిందే.. కేంద్రంలో మోదీ చేస్తున్నారు. మోదీ వచ్చే ముందు ఈడీ వస్తుంది. దేశంలోనే భాజపా అతిపెద్ద వాషింగ్ మెషీన్‌గా మారింది. దేశంలోని అవినీతిపరులంతా మోదీ ముందే నిల్చొన్నారు. ఎన్నికల సంఘంలోనూ మోదీ మనుషులున్నారు. ఎలక్టోరల్ బాండ్ల జాబితా చూస్తే ఏం జరిగిందో మీకే అర్థమవుతోందని అన్నారు. ఈ సభకు భారీగా జనం హాజరయ్యారు. తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ జనజాతర సభ నిర్వహించింది. కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి, ఉత్తమ్, శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం, సీనియర్ నేతలు విహెచ్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో వ్యవసాయం సంక్షోభం

మొదటి పేజీ తరువాయి...

అడిగితే ఎన్నికల కోడ్ ఉందని అంటున్నారు. చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్ ఎన్నికల కమిషన్ కు లేఖ రాయాలి. మేము కూడా ఉత్తరం రాస్తాం. కరువు వస్తే మమ్మల్ని తిడుతారా.? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది 14 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ విమర్శలు గుప్పించారు. మేడిగడ్డ నుంచి 200 క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయి. మేడిగడ్డలో పిల్లర్లు కుంగితే రిపేర్ చేయకుండా కేసీఆర్ ను బద్నాం చేస్తున్నారు.’ అంటూ కేటీఆర్ మండిపడ్డారు. ’అప్పుడు వర్షాలు పడి పంటలు మునిగిపోయాయని మంత్రి శ్రీధర్ బాబు గగ్గోలు పెట్టారు. ఇప్పుడు వర్షాలు పడలేదని అంటున్నారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం రూ.7 వేల కోట్లు సిద్ధంగా పెట్టాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ డబ్బులు ఇవ్వొద్దని కాంగ్రెస్ ఆపింది. ఇప్పుడు ఆ డబ్బులు ఏమయ్యాయో చెప్పాలి. తెలంగాణకు నీళ్లు రావాలంటే ఎత్తిపోతలే మార్గం. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు నిర్మించాం. భారీ మోటార్లు పెట్టి గోదావరి నీళ్లు ఎత్తిపోశాం. ఇవాళ కూడా గోదావరిలో 2 వేల క్యూసెక్కుల నీళ్లు పోతున్నాయి. 300 పిల్లర్లు ఉన్న బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే ప్రాజెక్ట్ మొత్తం కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని అంటూ మండిపడ్డారు. ’డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికీ ఒక్క మాట ఎందుకు మాట్లాడటం లేదు. ఎన్నికల్లో ఓడిపోయామని రైతుల తరఫున కొట్లాడకుండా ఆగుతామా?. వారికి అండగా నిలబడేందుకు ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త సిద్ధంగా ఉండాలి. రైతు భరోసా, రూ.4 వేల పెన్షన్, రూ.2 లక్షల రుణమాఫీ వచ్చిన వాళ్లు కాంగ్రెస్ కు ఓటెయ్యండి. రాని వాళ్లు మాకు ఓటెయ్యండి. హామీలను నెరవేర్చకుంటే ప్రజలు మమ్మల్ని తిరస్కరిస్తారన్న భయం కాంగ్రెస్ పార్టీలో మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి కొరత ఉంది. మిషన్ భగీరథ నిర్వహణ కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. హామీలపై సర్కారును నిలదీద్దాం. 420 కాంగ్రెస్ హామీలను ప్రతి ఒక్కరికీ గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. 30 వేల ఉద్యోగాలు ఇచ్చా అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. మీ ప్రభుత్వం వచ్చాక ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చిందో చెప్పాలి. ఈ రోజు రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. నేతన్నల కోసం టీఆర్ఎస్ పార్టీ దీక్షలు చేస్తోంది. ప్రభుత్వం నేతన్నలను ఆదుకునే వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# రాహుల్, అఖిలేష్‌లది ఓ ఫెయిల్యూర్ సినిమా: మోదీ

లక్నో, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) నేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడించటమే టార్గెట్‌గా ఇండియా కూటమిలో ఎస్పీ, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్, ఎస్పీ పొత్తు ఒక ఫెయిల్యూర్ సినిమా వంటిదని మోదీ ఎద్దేవా చేశారు. 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీ పెట్టుకున్న పొత్తు ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. ఇద్దరు బాలురి (రాహుల్, అఖిలేష్)సినిమా ఫెయిల్యూర్‌గా మిగిలిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌లో ర్యాలీలో మోదీ పాల్గొని మాట్లాడారు. ‘బీజేపీ 370 సీట్లు, ఎన్డీయే 400 సీట్లు గెలువకుండా ప్రతిపక్షాలు పోటీ చేస్తున్న మొదటి ఎన్నికలు ఇవి. సమాజ్‌వాదీ పార్టీ.. కాగ్రెస్ కోసం గంట గంటకు అభ్యర్థులను మార్చుకునే స్థితిలోకి వెళ్లిపోయింది. వారి బలమైన స్థానాల్లో సైతం పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకని పరిస్థితుల్లో ఎస్పీ ఉంది. ఇద్దరు బాలురి(రాహుల్, అఖిలేష్) సినిమా గతంలో ఫెయిల్యూర్ అయింది. అయినా మళ్లీ ఇప్పుడు జతకట్టారు’ అని మోదీ అన్నారు. 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌లు ఇద్దరు సుమారు ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో అగ్రాలో రోడ్డు షోలో కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఇక..లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి పొత్తులో భాగంగా మొత్తం 80 సీట్లలో ఎస్పీ-63 స్థానాల్లో, కాంగ్రెస్-17 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి.

# భారత్ ఎన్నికల్లో చైనా జోక్యం

మొదటి పేజీ తరువాయి...

కొలువుదీరనున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ ఈ హెచ్చరిక చేసింది. మైక్రోసాఫ్ట్ థ్రెట్ ఇంటెలిజెన్స్ టీమ్ ప్రకారం.. చైనా ప్రభుత్వ మద్దతు ఉన్న సైబర్ గ్రూప్‌లు ఈ ఏడాది జరగనున్న పలు దేశాల ఎన్నికలను ప్రభావితం చేయనున్నాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు డ్రాగన్ సోషల్ మీడియా వేదికగా ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను వాడనుందని మైక్రోసాఫ్ట్ టీమ్ పేర్కొంది. తన భౌగోళిక రాజకీయ ప్రయోజనాల నిమిత్తం ఉత్తర కొరియాతో కలిసి ఈ చర్యలకు పాల్పడనుందని ఆ సంస్థ థ్రెట్ అనాలసిస్ సెంటర్ జనరల్ మేనేజర్ క్లింట్ వాట్స్ బ్లాగ్ పోస్టు పెట్టారు. అలాగే ఓటర్ల మధ్య పలు అంశాల్లో విభజన తీసుకొచ్చి, యూఎస్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తనకు అనుకూలంగా వచ్చేలా నకిలీ ఖాతాలను ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తన లక్ష్యాల సాధనకు ఏఐ వినియోగాన్ని పెంచిందని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని మోదీ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ సమావేశమైన సంగతి తెలిసిందే. వారిద్దరూ ఏఐతో ఎదురవుతున్న సరికొత్త సవాళ్ల గురించి చర్చించారు. ‘ఏఐ శక్తిమంతమైనదే. కానీ.. సరైన శిక్షణ లేకుండా దీన్ని అందిస్తే దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడితే వక్రమార్గంలో పయనిస్తుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో డీప్‌ఫేక్‌ను ఎవరైనా వినియోగించొచ్చు. డీప్‌ఫేక్‌తో నా గొంతును కూడా అనుకరించారు‘ అని మోదీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఏఐ పెద్ద అవకాశమని.. అయితే సవాళ్లు ఉన్నాయని బిల్‌గేట్స్ హెచ్చరించారు.

# రైతుల సమస్యలపై మాట్లాడితే ఎదురుదాడులా?

మొదటి పేజీ తరువాయి...

ఉన్న బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే రైతులకు సహాయం చేయాలి. కేసీఆర్ కాలు పెట్టగానే బీజేపీ కళ్లు తెరిచి దీక్షలు చేస్తున్నారు. పంట ఎండిపోయిన రైతులకు వెంటనే ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలి. కాంగ్రెస్ నేతలు చిల్లర, బోగస్ మాటలు పక్కన పెట్టి రైతుల్ని ఆదుకోవాలి.’ అని డిమాండ్ చేశారు. ’అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఊపు తగ్గింది. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుంటున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్, రూ.4 వేల పింఛన్, రైతుబంధు రూ.15 వేలు, మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం, రూ.4 వేల నిరుద్యోగ భృతి, ఆడపిల్లలకు ఉచిత స్కూటీ అందిన వాళ్లే కాంగ్రెస్ కు ఓటెయ్యండి. అందని వాళ్లు బీఆర్ఎస్ కు ఓటెయ్యండి. ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి.’ అంటూ హరీష్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మడం లేదని బాండ్ పేపర్లు రాసి ఇచ్చి మరీ ప్రజలను మోసం చేశారన్నారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్దత కల్పిస్తామని, రెండు లక్షలు రుణమాఫీ చేస్తామన్నారని కానీ ఏ ఒక్కటీ చేయలేదన్నారు. రుణమాఫీ అయి ఉంటే కాంగ్రెస్ కు ఓటు వేయమని, కాకపోతే బీఆర్ఎస్ కు ఓటు వేయమని కోరారు హరీష్ రావు. కాంగ్రెస్ వచ్చింది కేసీఆర్ కిట్ బంద్ అయ్యిందని తెలిపారు. రైతులకు సాగునీరు, రైతు బంధు రావడంలేదని విమర్శించారు. బీబీ పాటిల్ బీఆర్ఎస్ లీడర్లను కొంటున్నారని ఆరోపించారు.

# కేసీఆర్‌కు జైలు కూడు తినిపిస్తా

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కార్యకర్తల చెమట చిందించడం వల్ల తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని గుర్తుచేశారు. బిఆర్ఎస్‌ను తొక్కినట్లే బిజెపిని కూడా తొక్కాలన్నారు. పదేళ్లుగా ప్రధాని పదవిలో ఉన్న మోడీ..మరోమారు ఎందుకు ప్రధాని కావాలని అడిగారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వనందుకా..రైతులపై కాల్పులు జరిపినందుకా అంటూ విమర్శలు గుప్పించారు. తుక్కుగూడలో జరిగిన జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గోదావరి, కృష్ణా నది పోటెత్తి సునామీ సృష్టిస్తే ఎలా ఉంటుందో తుక్కుగుడ అలా కనిపిస్తోందని కార్యకర్తలను రేవంత్ రెడ్డి ఉత్తేజ పరిచారు. తమపై గుజరాత్ ఆధిపత్యం నడవదని తేల్చిచెప్పారు.ఉద్యోగాల పేరుతో బీజేపీ మోసం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రైతులను చంపినందుకు బీజేపీకి ఓటేయాలా? మతాల మధ్య చిచ్చు పెట్టినందుకు వేయాలా..? అని రేవంత్ అడిగారు. ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య చిచ్చు పెట్టి మరోసారి అధికారంలోకి వద్దామని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే ప్రధాని మోదీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మోదీకి తెలంగాణ అంటే చిన్న చూపు అని వివరించారు. నమో అంటే కొత్త అర్థం చెప్పారు. నమ్మితే మోసం పోవడం ఖాయం అన్నారు. బీజేపీని బొంద పెట్టే వరకు నిద్రపోవద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఎలా ఓడించారో.. బీజేపీని అలాగే ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని.. జూన్ 9న ఢిల్లీలో మువ్వన్నెల జెండా ఎగరాలని అన్నారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని.. వారి కష్టం వల్లే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని పేర్కొన్నారు. ’కేసీఆర్ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో వందేళ్ల విధ్వంసం సృష్టించారు. వారు ఏం మాట్లాడినా చూస్తూ ఊరుకుంటాం అని కేసీఆర్ అనుకుంటున్నారు. అలా ఊరుకోవడానికి నేను జానారెడ్డిని కాదు.. రేవంత్ రెడ్డిని. ఎలా పడితే అలా మాట్లాడితే కేసీఆర్ ను జైల్లో పెడతాం. ఆయనకు చెర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపించడం ఖాయం. నువ్వు పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వలేదు. నేను మాత్రం నీకు తప్పకుండా చెర్లపల్లి జైలులో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తా. ఆయన కాలు విరిగింది. కూతురు జైలుకెళ్లారని జాలి చూపించాం అన్నారు. బిడ్డ, కొడుకు, అల్లుడు, ఆయన అందరూ కలిసి ఉండేలా ఇల్లు కట్టిస్తానని అన్నారు. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోనని కేసీఆర్‌కు రేవంత్ వార్నింగ్ ఇచ్చారు. కరీంనగర్ సభలో కేసీఆర్ మాట్లాడిన మాటలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి భాష ఇలాగే ఉంటుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తలచుకుంటే కేసీఆర్ బయట తిరగలేరని తీవ్రంగా హెచ్చరించారు. కేసీఆర్‌కి కష్టం వచ్చిందని మానవత్వంతో మౌనంగా ఉన్నామన్నారు. ఢిల్లీ నుంచి రాష్ట్రానికి నిధులు కావాలంటే రాష్ట్రంలో 14 మంది ఎంపీలను గెలిపించాలి.’ అని రేవంత్ పేర్కొన్నారు. తమ పాలన నచ్చితే పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపీ స్థానాల్లో గెలిపించాలని కోరారు. తమ పాలన నచ్చకపోతే ఆలోచించాలని చెప్పారు. రాహుల్ గాంధీని దేశానికి ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. గంట గంటకు డ్రెస్ మార్చి, చెప్పిన అబద్ధం చెప్పకుండా ఉండే మోదీ ప్రధాని కావాలా అని ప్రశ్నించారు. రానున్నవి ఎన్నికలు కావు పోరాటమని చెప్పారు. మోదీ కుటుంబానికి, గాంధీ కుటుంబానికి జరుగుతున్న పోరాటం ఇదని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ, ఎలక్షన్ కమిషన్ మోదీ కుటుంబమని చెప్పారు. ప్రాణ త్యాగం చేసిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పదవి త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ కుటుంబమని చెప్పారు. రాహుల్ గాంధీతో తెలంగాణ కలిసి నడుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భారాసను తుక్కుతుక్కు గా ఎలా ఓడించామో.. కేంద్రంలో భాజపానూ అలాగే ఓడించాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని కోరారు. గుజరాత్ మోడల్‌పై ’వైబ్రెంట్ తెలంగాణ’ ఆధిపత్యం చూపిస్తోంది. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. పదేళ్లలో మోదీ 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 7 లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీలో రైతులు 17 నెలలు పోరాడారు. ఈ క్రమంలో 750 మంది చనిపోయారు. బాధిత కుటుంబాలను మోదీ పరామర్శించలేదు. జాతీయ ఎన్నికల మ్యానిఫెస్టోను తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ విడుదల చేయడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ అన్నారు. తుక్కుగూడ నుంచి జాతికి 5 గ్యారంటీలను అంకితం చేశారన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ జండా ఎగురబోతుందన్నారు.

# 400 సీట్లతో మళ్లీ అధికారం మాదే

### కాంగ్రెస్ హామీలను విస్మరించింది.. బిఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయం

### బిజెపి ఆవిర్భావ దినోత్సవంలో కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లతో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలో భారాస రోజురోజుకు కనుమరుగవుతోందన్నారు. హామీలను నెరవేర్చే స్థితిలో కాంగ్రెస్ లేదని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని చెప్పారు. తెలంగాణలో పదికి పైగా ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ విశ్వ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణకు రాహుల్ గాంధీ ఆరు గ్యారంటీలు ఇచ్చి వంద రోజుల్లో చేసి తీరతామన్నారు. వాటిని అమలు చేయకుండా ఆయన తెలంగాణకు ఎలా వస్తారు. హామీలు అమలు చేయలేదు కానీ... పెద్ద పెద్ద ప్రకటనలు, సభలు పెడుతున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని కేంద్రమంత్రి హామీలను నెరవేర్చే స్థితిలో ఆ పార్టీ లేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన గ్యారంటీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. గ్యారంటీలను అమలు చేయకుండా రాహుల్ గాంధీ తెలంగాణకు ఏమొహం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలను ఎక్కడ అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజురోజుకు కనుమరుగవుతున్నదని చెప్పారు. తెలంగాణలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.




# దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

### 370 సీట్ల లక్ష్యం కోసం విపక్షాలకు బెదరింపులు

### రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ కుట్రలు

### జైపూర్ ఎన్నికల ప్రచారంలో సోనియా విమర్శలు

జైపూర్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): దేశ గౌరవం, ప్రజాస్వామ్యానికి మోదీ తూట్లు పొడుస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 సీట్లు గెలుచుకునేందుకు బీజేపీలో చేరాల్సిందిగా విపక్ష నేతలను బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ సారథ్యంలోని కేంద్ర కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశం గట్టి గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లోని జైపూర్‌లో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో సోనియాగాంధీ మాట్లాడుతూ, తనను తాను ఒక గొప్పవ్యక్తిగా మోదీ భావించుకుంటూ దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. బీజేపీలో చేరాలని విపక్ష నేతలను బెదిరిస్తున్నారని, ఈరోజు దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఇదంతా నియంతృత్వమేనని, దానికి కలిసికట్టుగా గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ, ఈసారి ఎన్నికలు ఎంతో నిర్ణయాత్మక ఎన్నికలని అన్నారు. రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలని చెప్పారు. రాజ్యాంగాన్ని బలహీనపరచడమే కేంద్ర ప్రభుత్వ విధానమని అన్నారు. రైతులకు కనీసమద్దతు ధర కల్పిస్తామని తొలిసారిగా మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఛత్తీస్‌గఢ్‌లో ప్రకటించారని, ఈ ఎన్నికలు అత్యంత కీలకమైన ఎన్నికలని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌లను ఈడీ అరెస్టు చేయడాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రస్తావిస్తూ, కేంద్రంలోని బీజేపీ హయాంలో విపక్షాలు దాడులకు గురవుతున్నాయని ఆరోపించారు. ప్రతి రాష్ట్రంలోనూ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పతాక స్థాయికి చేరుకున్నాయని, రైతులు, పేదల గోడు వినే నాథుడే లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోకు ‘న్యాయ్ పాత్ర‘ అనే పేరు పెట్టిందని, ఇది ఎంతమాత్రం ఎన్నికల తర్వాత మరిచిపోయే ప్రకటనల జాబితా ఎంతమాత్రం కాదని, న్యాయం కావాలని కోరుకుంటున్న దేశప్రజల వాణి అని అన్నారు.

# మండుటెండల్లో చల్లటి వార్త

మొదటి పేజీ తరువాయి...

పేర్కొంది. ఆదివారం ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ వేడి, తేమతో కూడిన పరిస్థితులుంటాయని చెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో రాత్రిపూట వేడిగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని వివరించింది.

# ములుగు జిల్లాలో ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి...

సమీపంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి చెందారు. వరంగల్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో కరిగుట్టలు వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. వారి వద్ద నుంచి ఒకే ఏకే 47, ఒక ఎల్ఎంజీ ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణ సరిహద్దుల్లో నిఘా పెరిగింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వచ్చే పోయే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో తరచూ కాల్పుల ఘటనలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో పెద్ద ఎత్తున హింసాత్మక ఘటనలకు మావోయిస్టులు ఎ÷-లాన్ చేశారన్న అనుమానంతో తనిఖీలు సాగుతున్నాయి. రిక్రూట్‌మెంట్‌లు కూడా భారీగా జరుగుతున్నాయన్న సందేహాలు పోలీసుల్లో ఉన్నాయి.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా బిజెపి వ్యవస్థాపక దినోత్సవం

## పార్టీ జెండా ఎగరవేసిన బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్





బిజెపి కార్యకర్త ఇంట్లో టిఫిన్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 172 వ బూత్ అధ్యక్షుడు వేముల జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వై శ్రీధర్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వై శ్రీధర్ మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గత పదిలలో అవినీతి పాలన అందిస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుందన్నారు. డివిజన్ బిజెపి అధ్యక్షుడు జి బాబురావు మాట్లాడుతూ... 1980 లో జనసంఘ్ నుండి భారతీయ జనతా పార్టీ ఏర్పడి 44 సంవత్సరాలు అవుతుందని జనసంఘ్ వ్యవస్థాపకులు దీనదయల్ ఉపాధ్యాయ , శ్యాంప్రసాద్ ముఖర్జీ అయితే నాటి నుండి పనిచేసిన మాజీ ప్రధానిశ్రీ అటల్ బిహారీ వాజపేయి , ఎల్ కే అద్వానీ భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసి కేంద్రంలో 2 పార్లమెంట్ సీట్ల నుండి కేంద్రంలో4 సార్లు ప్రభుత్వం ఏర్పాటు చేశారు మన ప్రధాని తిరిగి ముచ్చటగా 3 వ సారి ప్రధాని కాబోతున్నారు. కేంద్రంలో మరోసారి రాబోయేది బిజెపి ప్రభుత్వమేనన్నారు. పార్టీ జెండా అగరవేసి అనంతరం బూత్ అధ్యక్షుడి ఇంట్లో టిఫిన్ బైటక్ జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీసీ మూర్చ డి సత్యనారాయణ, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు మూల శ్రీనివాస్ గౌడ్, తొండుపల్లి మల్లేష్, భాస్కర్ యాదవ్ ఈ వేణు గోపాల్, బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ని ఎం వనిత రెడ్డి. కె శేశిధర్, కె వంశీ, జ్ఞానేశ్వర్ , జి పద్మావతి, ,స్వప్నా రెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు .



# ఉప్పర్‌పల్లిలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్ పల్లి లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం డివిజన్ పరిధిలోని ఉప్పరపల్లిలో డివిజన్ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు స్వప్న పార్టీ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఎం వనిత రెడ్డి,నాయకులు విఠల్, తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

## అణగారిన వర్గాల ఆరాధ్యుడు

# బాబు జగ్జీవన్ రామ్: బాబు రావు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం): అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని వెంకటేశ్వర కాలనీ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆవునూరి బాబురావు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, పరిపాలన దక్షుడు దళిత వర్గాల నాయకుడు భారత జాతీయ సమగ్రతనకు జీవితం ధారపోసిన దేశభక్తుడు బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని వెంకటేశ్వర కాలనీ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ... మొదటి దళిత ఉప ప్రధానిగా పనిచేసిన ఆయన పేదలందరికీ చౌక ధరలతో ఆహార పదార్థాలు అందజేయాలన్న ఉద్దేశంతో చౌక దుకాణాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘము ప్రధాన కార్యదర్శి ఆదిమూల చంద్రశేఖర్, కోశాధికారి పాట్లవత్ రామారావు, సీనియర్ నాయకులు జోగు రవి, కళ్లెం మల్లేష్, సి.హెచ్. మన్యం, వెంకటరమణ, అనిల్ కుమార్, గడ్డం వెంకటేష్, బి.కరణ్, లింగని కృష్ణ, రాజు, భీమ్ రావు, నరేష్, సిద్దేశ్వర్, బాలస్వామి, వెంకటస్వామి, గోపాల్, రమేష్, మాధవులు, రాజు, శ్రీశైలం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ లో బిజెపి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఎగురవేస్తున్న బిజెపి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య

# బిజెపితోనే దేశ ప్రగతి: బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య

## ప్రధాని నరేంద్ర మోడీ హాయంలో దేశం ప్రపంచ ఖ్యాతి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం) బిజెపితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని గత 10 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోడీ చేసి చూపించారని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య అన్నారు. శనివారం బిజెపి వ్యవస్థాపక దినోత్సవం లో భాగంగా అత్తాపూర్ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ జెండా ఆయన ఎగరవేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ... ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ప్రగతి పథంలో ముందుకు వెళ్లడంతో పాటు పేద ప్రజల సంక్షేమానికి అవసరమయ్యే పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. దేశ ప్రజలు మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 400 సీట్లు రావడం ఖాయం అన్నారు. తెలంగాణలో బిజెపికి అత్యధిక స్థానాలు ఇవ్వటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి మరోసారి ప్రజలు అధికారం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అత్తాపూర్ సర్కిల్ లో 212 భూత్ అధ్యక్షుడు శివ కుమార్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పార్టీ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కాడెం సుధాకర్ ,రాచూరి రాజశేఖర్ ,స్టార్ చిన్న సరిత రెడ్డి, విజయ రెడ్డి, రాములు ,విజయ్ కుమార్, బిట్కూరి సిద్దేశ్వర్ ,నరేష్ ,వినోద్ సింగ్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో తల్లిదండ్రులతో వైద్య కోర్స్ సర్టిఫికెట్ తో డాక్టర్ ఉదయ్ కుమార్

# డాక్టర్ సర్టిఫికెట్ అందుకున్న ఉదయ్ కుమార్

## ఘనంగా సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవం

రాజేంద్రనగర్, ఏప్రిల్6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ చెందిన ఈర్లపల్లి లావణ్య,రామకృష్ణ దంపతుల కుమారుడు ఈర్లపల్లి ఉదయ్ కుమార్ సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో డాక్టర్ కోర్స్ పూర్తి చేశారు. కళాశాల లో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టర్ ఉదయ్ కుమార్ సర్టిఫికెట్ అందుకున్నారు. తమ కుమారుడు ఉదయ్ వైద్య కోర్స్ పూర్తి చేసిన సందర్భంగా తమ మార్గదర్శకులు సోదరుడు ఈ ఎన్ అశోక్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారని రామకృష్ణ తెలిపారు. డాక్టర్ ఉదయ్ కుమార్ భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత చదువులు చదివి సామాన్య ప్రజలకు వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రోత్సహిస్తామని అశోక్ కుమార్ అన్నారు.



పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# చేవెళ్ల సభను విజయవంతం చేయాలి

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) ఈ నెల 13 న చేవెళ్ళలో కెసిఆర్ నిర్వహించే భారీ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మైలార్ దేవ్ పల్లి లోని ఎమ్మెల్యే నివాసం లో రాజేంద్రనగర్ సర్కిల్ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ఈనెల 13 న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కసాని జ్ఞానేశ్వర్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం తరుపున భారీ జన సమీకరణ చేయాలని సూచించారు. పార్టీ లో ప్రతీ ఒక్కరూ పార్టీ గెలుపు కొసం కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రేమ్ గౌడ్, కోలన్ సుభాష్ రెడ్డి పడమటి శ్రీధర్ రెడ్డి సరికొండ వెంకటేష్ మాజీ కౌన్సిలర్ వెంకటేష్, గుమ్మడి కుమార్, బండారి శంకర్, మాదూరి ప్రభాకర్ రెడ్డి, తోకల సుధాకర్ రెడ్డి, కాశి గారి యాదగిరి, సిద్ధం జగదీష్, ముజామిల్ అహ్మద్, బండారి యాదగిరి, శరణమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

## పార్టీకి రాజీనామా చేసిన రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ బి ఆర్ ఎస్ నాయకులు సామ ఇంద్ర పాల్ రెడ్డి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. రాజేంద్రనగర్ లో టిఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. బిఆర్ఎస్ పార్టీని వీడి ఒక్కొక్కరుగా అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ ఇంద్ర పాల్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ కి రాజీనామా చేస్తున్నట్లు సామ ఇంద్ర పాల్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కి రాజీనామా లేఖను పంపడం జరిగిందని, పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధిని కాంక్షించి పార్టీలో చేరడం జరిగిందని, అప్పటి నుంచి నేటి వరకూ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేయడం కోసం కృషి చేశామని, క్రమశిక్షణతో పార్టీ పట్ల అంకితభావంతోనే తాము సేవలందించామన్నారు. 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గెలుపు కోసం కృషి చేశామని, అలాగే 2019లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. కానీ గడిచిన కొంతకాలంగా మా పట్ల వ్యతిరేక భావనతో ఉండడంతోనే, తాము ఆత్మగౌరవాన్ని చంపుకోలేక టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. పార్టీలో సహకరించిన పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నాయకులందరితో కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు



పార్టీ రాజీనామా చేసిన పత్రం చూపిస్తున్న బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి



నార్సింగిలో ఇంటింటికి ప్రచార నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

# చేవెళ్లలో బిజెపి గెలుపు తథ్యం

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్

గండిపేట, ఏప్రిల్6(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి భారీ మెజార్టీతో కైవసం చేసుకోవడం తధ్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలోని నార్సింగ్ మున్సిపాలిటీ లో భారతీయ జనతా పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికి ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకల్ల నరేందర్ రెడ్డి, నందకిషోర్, మల్లేష్ యాదవ్, పార్టీ నాయకులు , మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తుక్కుగూడ సభకు భారీగా తరలిన రాజేంద్రనగర్ కాంగ్రెస్ నాయకులు



తుక్కుగూడ కాంగ్రెస్ సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు



సభకు బయలుదేరిన వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

రాజేంద్రనగర్, ఏప్రిల్6(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల కోసం తుక్కుగూడ లో తల పెట్టిన సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. శనివారం తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ వాహనాలను సభకు పార్టీ నాయకులు కార్యకర్తలు, తరలి వెళ్లారు. తుక్కుగూడ సభకు తరలి వెళ్తున్నా వాహనాలకు బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 16 పార్లమెంట్ సీట్లు గెలుచుకుంటుందని అన్నారు. సభకు తరలిన వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరని బాలరాజు, విపి లలిత్, తదితరులు ఉన్నారు.

# మధురానగర్‌లో 6.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం

## మంచి నీటిని వృధా చేయకండి : కౌన్సిలర్ స్రవంతి శ్రీకాంత్ రెడ్డి







శంషాబాద్,ఏప్రిల్ 6( ప్రభాత ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని మధురానగర్ ను అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నట్లు స్థానిక కౌన్సిలర్ స్రవంతి శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి అధికారుల సహకారంతో ఇప్పటివరకు తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధుల ద్వారా ఆరు కోట్ల 50 లక్షలు రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు గత వర్షాకాలంలో తగినన్ని వర్షాలు కురువనందున భూగర్భ జలాలు అడుగంటి పోయాయని కాలనీవాసులు దీనిని దృష్టిలో ఉంచుకొని మంచినీటిని పొదుపుగా వాడాలని సూచించారు. నీటిని వృధా చేసేవాళ్లను రోడ్లపైకి నీటిని వదిలే వారికి జరిమానా విధించడంతో పాటు వారి నల్ల కనెక్షన్ ను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గల్లీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ. సిసి రోడ్ల నిర్మాణం తో పాటు ఇంటింటికి మంచినీటి సరఫరా చేపట్టడం జరిగిందని ఆమె వివరించారు . వీధి దీపాల ఏర్పాటుతోపాటు బస్తి ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు సమకూర్చి అన్ని బస్తీలలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని స్రవంతి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కవితా ప్రసాద్. సహకార సంఘం చైర్మన్ ముద్దం మల్లారెడ్డి .స్థానిక నాయకులు తోట రాములు. గోటూరి పవన్ గౌడ్. ఈదుల నరసింహ గౌడ్. జైహింద్ రెడ్డి సౌమ్య నామచంద్రశేఖర్. ఇంద్రాణి. జెల్లపల్లి శ్రీనివాస్. గోవర్ధన్ రెడ్డి. అశోక్ గౌడ్. గోపాల్ రెడ్డి. చెన్నారెడ్డి. సుభాష్. రామ అవతార్ శర్మ. శ్రీశైలం. గుంటి రవి. విఠల్. రమేష్. సాయి. దామోదర్. రాజు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా భాజాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## యువత ఆకాంక్షలను నెరవేర్చగల ఏకైక పార్టీ బీజేపీ: మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కూకట్ పల్లి అసెంబ్లీ ప్రాంతంలో ఘనంగా జరిగాయి, 115వ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండా ఆవిష్కరణకు కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి మాధవరం కాంతారావు హాజరై కమలం జెండాను ఎగురవేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న స్థాపించిన భారతీయ జనతా పార్టీ అనేక ఒడిదుడుకులకు నిలబడి నేడు దేశంలోనే అతిపెద్ద జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, వాజపేయి, అద్వానీ వంటి మహనీయులు చూపిన మార్గంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా దేశం కోసం, ధర్మం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్న బిజెపి కార్యకర్తలు, అభిమానులు మద్దతుదారులు ఉండడం నిజంగా గర్వించదగ్గ విషయమని అన్నారు, దేశంలోని 140 కోట్ల మంది భారతీయుల కలలను బీజేపీ సాకారం చేసిందని, యువత ఆకాంక్షలను నెరవేర్చగల ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు, సబ్ కా సాత్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ బిజెపి నినాదానమని, నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశ వృద్ధి రేటు పెరిగిందని, ప్రపంచ దేశాలు సైతం మోది నాయకత్వాన్ని కోరుకుంటున్నారనిఅన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం, త్రిపుల్ తలాఖ్, ఆర్టికల్ 370 వంటి సాహసోపేతమైన నిర్ణయాలు మోది సారధ్యంలో సాకారమైయ్యాయని మరిన్ని కీలక బిల్లులు ఆమోదం పొందేందుకు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 400 పైగా సీట్లు అందించి ఘన విజయాన్ని బిజెపికి అందించాలని, కమలం పువ్వు గుర్తుకే ఓటేసి మరోసారి మోది ని ప్రధానిని చేయాలని, భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని ప్రజలకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, భగవంత్ రెడ్డి, చలపతిరావు, రాము,అనీల్, సంతోష్, అర్జున్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ జన జాతర సభ జైత్ర యాత్రకు నాంది

## తెలంగాణ నుంచే జాతీయ కాంగ్రెస్ జంగ్ సైరన్
## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) రానున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తన్న అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తుక్కుగూడ "జన జాతర" భారీ బహిరంగ సభను విజయవంతం చేయుటకు కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ కైతలపూర్ నుంచి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు 100 బస్సులకు జెండా ఊపి బయలుదేరిన కూకట్ పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, కార్యకర్తలు వెయ్యి మందికి పైగా భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఈ సభలో భారత కాంగ్రెస్ రూపొందించిన ఎన్నికల పాంచ్ న్యాయ్ గ్యారంటీలకు సంబంధించి మేనిఫెస్టో తెలుగు ప్రతిని విడుదల చేయడంతో పాటు కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనుల కార్యాచరణను ప్రకటించారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు ఇచ్చే భరోసా ను ఈ వేదిక నుంచే కాంగ్రెస్ అధినాయకత్వం విడుదల చేయడం హర్షణీయమని అన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు దేశం ఆశ్చర్యపోయేలా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించుకొని కాంగ్రెస్ శ్రేణులు అంతా కదం తొక్కుతూ పెద్ద ఎత్తున తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేశారన్నారు. మన దేశ భవిష్యత్తుకు ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన లోక్ సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డమీద నుంచి జాతీయ కాంగ్రెస్ పార్టీ జంగ్ సైరన్ మోగించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కూకట్ పల్లి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



ఎండిన వరిని చూపిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

## ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం)కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆరోపించారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రైతు దీక్ష కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కరవు వచ్చిందని విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్ల పాటు కరవు రాలేదన్నారు. గత పదేళ్లలో రైతులకు కష్టాలు రాలేదని.. కాంగ్రెస్ వచ్చిన వంద రోజుల్లోనే కష్టాలు వచ్చి పడ్డాయని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్రకు నిరసనగా ఈ దీక్ష చేపట్టిన కూడా ఎండి పోయిన పంటలను కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ గెలవడానికి రైతులకు హామీలు ఇచ్చారని గెలిచాక పట్టించుకోవడం లేదన్నారు. ఎండిన పంటలకు ఎకరానికి రైతులకు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం యాసంగి సీజన్ నుంచి రైతులకు రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణమే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. రైతుల పక్షాన ముందు ముందు ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జననం

## పేట జిల్లా ఆస్పత్రిలో సాదరణ ప్రసవంలో...

నారాయణపేట ,ఏప్రిల్6(ప్రభాత ఉదయం) సాధారణంగా కాన్పులు జరిగితే ఒక మగ బిడ్డనో ....ఒక ఆడబిడ్డనో లేక ఇద్దరూ కవల పిల్లలు ( మగ లేక ఆడ ) పుట్టడం జరుగుతుంది కానీ నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జన్మించిన అరుదైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. నారాయణపేట మండలం కొల్లం పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ మొదటి ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో రక్తహీనత ఉండడంతో యువశక్తి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ తరపున బీ పాజిటివ్ బ్లడ్ డొనేట్ చేయించి రక్తం అందించారు. ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షల అనంతరం సాధారణ ప్రసవంలోనే లక్ష్మికి ముగ్గురూ శిశువులు జన్మించారు. వీరిలో ఒక మగ ఇద్దరు ఆడ శిశువులు(ఒక్కొక్కరూ సుమారు 1.5 కిలోల బరువు) తో ఉన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ ఒకే కాన్పులో ముగ్గురు జన్మించడం చాలా అరుదు అని ప్రస్తుతం లక్ష్మి ఆరోగ్య పరిస్థితి జన్మించిన ముగ్గురు శిశువుల పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు.

# మాట ఇచ్చాం, చేసి చూపిస్తాం

## అభివృద్దే ప్రధాన లక్ష్యం.. రానున్న ఎంపీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం..

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్..




కూకట్‌పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) తుక్కుగుడా రాజీవ్ గాంధీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించనున్న భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించనున్న పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన తుక్కుగుడా సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తరలిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ సైన్యం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, రేవంత్ రెడ్డి నాయకత్వంలో మనం అందరం ముందుకు సాగుదాం, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దాం అని నాదంతో బయలుదేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ నుంచి భావి విభారత్ ప్రధాని రాహుల్ గాంధీ దేశ స్థితిగతులను మార్చేందుకు ముందుకు సాగుతున్నారని, ఈ గడ్డ నుంచే పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటిస్తుందడం చాలా గర్వకారణం అని అన్నారు. ఇప్పటికే రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వైద్యసేవలు వంటి పథకాలు పేదల జీవితాల్లో ఆర్థిక వేసులుబాటును కల్పిస్తున్నామని, నేడు ప్రకటిస్తున్న పథకాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం వచ్చాక మొదటిసారి కాంగ్రెస్ అధినాయకత్వం విచేస్తున్న ఈ సభకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కదిలి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

# మున్సిపల్ కార్మికులకు బకాయి జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించాలి

గద్వాల, ఏప్రిల్ 6(ప్రభాత ఉదయం)గద్వాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, విద్యుత్, మంచినీటి సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉగాది పండుగ ఉన్నందున మూడు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని శానిటేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రాజేష్ కోరారు. శనివారం గద్వాల మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం అందించారు. శానిటేషన్ వర్కర్లకు బకాయి ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ వెంటనే జమ చేయాలని కోరారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులతో ఒక పూటనే పని చేయించాలని, సబ్బులు, నూనెలు, డ్రస్సులు తదితర సౌకర్యాలు కల్పించాలని కమీషనర్ కు విన్నపించారు. కమిషనర్ స్పందిస్తూ రెండు నెలల జీతాలు వెంటనే ఇస్తామని, రెండు నెలల పిఎఫ్, ఒక నెల ఈఎస్ఐ, జమ చేస్తామని మిగిలిన పెండింగ్ పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు విడతల వారిగా జమ చేస్తామని కమీషనర్ హామీ ఇచ్చారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులతో ఒక పూట పని చేపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నరసింహ, కమిటీ సభ్యులు రవి, రాము, బాలరాజు, జవాన్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి, ఏప్రిల్ 6 (ప్రభాత ఉదయం) మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జన్మదినాన్ని పురస్కరించుకొని గంధం పృథ్వీరాజ్ ఆయన నివాసానికి వెళ్లి, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆశ్రయ అనాధ శరణాలయంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంధం పృద్వి ఆధ్వర్యంలో వృద్ధులకు మరియు చిన్న పిల్లలకు పండ్లను పంపిణీ చేశారు. సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా జీవించాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా వృద్ధులు, చిన్న పిల్లలు దీవించారు. ఆశ్రయ అనాధ శరణాలయంలో వృద్ధులు మరియు చిన్నపిల్లల తో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం , రమేష్ ఆంజనేయులు చౌదరి సందీప్, రమాకాంత్ పూర్ణ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.